క్లుప్తంగా

బెదిరించి డబ్బు వసూలు చేస్తున్న వ్యక్తి అరెస్టు

మంగళగిరి: బడ్డీ కొట్టుల యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ఓ వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ క్రాంతికిరణ్ గురువారం వివరాలను వెల్లడించారు. మంగళగిరి గండాలయపేటకు చెందిన చెన్నుపల్లి మోహన్ కొంతకాలంగా బడ్డీ కొట్ల యజమానులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నాడు. యర్రబాలెంలో బడ్డీ కొట్టు నడుపుతున్న ఆకుల శివనాగరాజును ఏడు నెలలుగా బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నాడు. అనుమానం వచ్చిన శివనాగరాజు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నిఘా ఏర్పాటు చేసి గురువారం మోహన్‌ను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

4న కాజలో ఏరువాక ఉత్సవం

కాజ(మంగళగిరి): నగర పరిధిలోని కాజలో ఈనెల 4వ తేదీ ఏరువాక ఉత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు అతిపెద్ద పండుగ ఏరువాక ఉత్సవమని తెలిపారు. ఆ రోజు సాయంత్రం కాజలోని శ్రీరత్న గర్భ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజల అనంతరం ఎద్దుల బండ్లు, నాగళ్లతో అలంకరించిన అరకలతో ట్రాక్టర్లు, మేళతాళాలతో పూజలు నిర్వహించి వ్యవసాయ పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఏరువాక ఉత్సవంలో పెద్ద ఎత్తున రైతులు తమ అరకలు, ట్రాక్టర్లతో తరలిరావాలని కోరారు.

నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా శివారెడ్డి



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా బిక్కిరెడ్డి శివారెడ్డిని నియమిస్తూ గురువారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం కావలి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన డిప్యూటీ కమిషనర్‌గా రానున్నారు. గతంలో తాడేపల్లి మున్సిపల్ కమిషనర్‌గా బిక్కిరెడ్డి శివారెడ్డి విధులు నిర్వహించారు.

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు తాడేపల్లిగూడేనికి బదిలీ అయ్యారు. ఈ మేరకు పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోపాలరావు సుమారు రెండు సంవత్సరాలుగా తెనాలిలో విధులు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన తాడేపల్లిగూడెం పురపాలక సంఘానికి బదిలీ అయ్యారు. మచిలీపట్నంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కె.అనూషను తెనాలికి బదిలీ చేశారు. రెండు మూడు రోజుల్లో వీరు బదిలీ స్థానాల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది.

ముగిసిన అంకమ్మతల్లి సంబరాలు

నగరం: మండలంలోని తాడివాకవారి పాలెంలో వారం రోజులుగా జరుగుతున్న అంకమ్మ తల్లి సంబరాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారులు అమ్మవారి ఘటాలను శాస్త్రయుక్తంగా ఆలయంలో పునఃప్రవేశపెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

తెనాలి చేరిన 'విద్యాకానుక'

తెనాలిఅర్బన్: జగనన్న విద్యాకానుక కిట్లు కొంత భాగం గురువారం తెనాలి చేరాయి. గుంటూరు నుంచి విద్యాశాఖ ఉన్నతాధికారులు వీటిని తెనాలి పంపారు. కొత్తపేట బాలురోన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో వీటిని భద్ర పరిచారు. తెనాలికి 33,529 టెక్స్ట్ బుక్స్, 12,041 యూనిఫాంలు, 1291 డిక్షనరీలు వచ్చినట్లు ఎంఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. మిగిలినవి మరీ కొద్ది రోజుల్లో వస్తాయని వెల్లడించారు. కిట్‌లోని యూనిఫాం, పుస్తకాలు తదితరాలను ఆయన పరిశీలించారు.

వైభవంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

శిరిపురం(కొల్లిపర): శిరిపురం గ్రామంలోని సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం వైభవంగా నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య తిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విచ్చేసి, పూజలు చేశారు.

లక్ష తులసి పూజ

పాతగుంటూరు:లాలాపేటలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నిత్య హోమం, బలిహరణ, లక్ష తులసి పూజ నిర్వహించారు. రాత్రి హనుమంత వాహనంపై గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాల్ని దేవస్థానం చైర్మన్ పిచ్చల జయప్రకాష్‌రెడ్డి, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ప్రసాద్, మురళి, చంద్రకుమార్, శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు. ధరకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకటజ్యోతి, నరేష్‌కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్
- తాడికొండ, పెదపరిమిలో వలంటీర్లకు పురస్కారాలు అందజేత



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో కత్తెర సురేష్‌కుమార్

తాడికొండ: అంకితభావంతో పనిచేస్తే వలంటీర్లకు ప్రభుత్వం నుంచి తగిన గుర్తింపు లభిస్తుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండల పరిషత్ కార్యాలయం, పెదపరిమి సచివాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పురస్కారాలు అందుకున్న వలంటీర్లు బాధ్యత తెలుసుకొని బాధ్యతాయుతంగా నడుచుకోవాలన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ బేధాలు లేకుండా పాలన చేసిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చంద్రబాబు పాలలో ఒక్క జనరంజక సంక్షేమ పథకం లేదనడంలో అతిశయోక్తి లేదన్నారు. సమాజానికి మేలు చేసేందుకు జగనన్న ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన వలంటీర్, సచివాలయ వ్యవస్థ దేశంలోనే మంచి పేరు ప్రఖ్యాతులు సాధించిందన్నారు. 14 సంవత్సరాల పాలనలో పేదలకు ఒక్క మంచి పని చేయని చంద్రబాబు నాయుడు ఇప్పుడు ప్రజలు తనకు రాజకీయంగా చరమగీతం పాడుతున్నారని గ్రహించి అబద్ధపు హామీలతో తప్పుడు మేనిఫెస్టో విడుదల చేయడం సిగ్గుచేటన్నారు.

గతంలో 600 పేజీల మేనిఫెస్టో విడుదల చేసిన చంద్రబాబు ఒక్క హామీని నెరవేర్చలేదని, ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో మళ్లీ మేనిఫెస్టో పేరుతో అన్ని వర్గాలను మోసం చేయాలనుకోవడం దుర్మార్గం అన్నారు. పలువురు వలంటీర్లను కత్తెర సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో పురస్కారపత్రం అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, తాడికొండ, నిడుముక్కల గ్రామ సర్పంచ్‌లు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో బిక్కి మహేష్‌బాబు, తుళ్లూరు ఎంపీడీవో ఎ శ్రీనివాసరావు తుళ్లూరు మండల నాయకులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ఇవ్వని ప్రైవేటు కళాశాల యాజమాన్యం

- ప్రభుత్వ పాఠశాల హెచ్ఎంను ఆశ్రయించిన విద్యార్థిని
- పూర్వ విద్యార్థిని ఆర్థిక సహాయం



హేమకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. ఏడుకొండలు

తాడేపల్లిరూరల్: ఫీజు కట్టకపోతే సర్టిఫికెట్లు ఇవ్వబోమని ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం నిరాకరించింది. చివరకు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుల చొరవ, పూర్వ విద్యార్థి ఆర్థిక సాయంతో ఆ విద్యార్థినికి సర్టిఫికెట్లు అందాయి. ఈమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం.. ఈమనికి చెందిన కనపాల హేమ స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 2020లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 590 మార్కులు సాధించింది. అనంతరం తెనాలిలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్‌లో చేరింది. విధి వక్రించడంతో ఆమె తండ్రి అనారోగ్యంతో చనిపోయాడు. అనంతరం తల్లి కూడా అనారోగ్యానికి గురైంది. ఆర్థిక ఇబ్బందులు వెంటాడాయి. హేమ మధ్యలో చదువు మానేసింది. ఆమె 10వ తరగతి మార్కుల లిస్ట్‌తోపాటు ఇంటర్మీడియట్ చదివినట్లు సరిఫికెట్లు ఇచ్చేందుకు కాలేజీ యాజమాన్యం నిరాకరించింది. బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పింది. హేమ హైస్కూల్‌కు వెళ్లి ప్రధానోపాధ్యాయునికి వివరించింది. ఆయన పాఠశాల పూర్వ విద్యార్థుల గ్రూప్‌లో ఈ విషయాన్ని పోస్ట్ చేయగా సింగ్‌పూర్‌లో సీనియర్ సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థిని షేక్ నసీమా రూ.35 వేల ఆర్థిక సహాయం చేసింది. ఆ నగదును కళాశాల యాజమాన్యానికి చెల్లించి సర్టిఫికెట్లు హేమకు అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన షేక్ నసీమాకు తమ పాఠశాల తరుపున ఉపాధ్యాయుల తరపున అభినందనలు తెలిపారు.

బాధితులను ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే



గాయపడ్డ వారిని ఆసుపత్రికి పంపుతున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇరువురిని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) హుటాహుటిన తన వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే ఆర్కే గురువారం నృసింహస్వామి ఆలయంలో సమావేశం ముగించుకుని పెదకాకాని వెళుతున్నారు. అదే సమయంలో చినకాకానికి చెందిన బల్లా కుమారిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని ఓ యువకుడు వస్తుండగా అదే గ్రామానికి చెందిన ముద్రబోయిన వెంకటకృష్ణయ్య ద్విచక్రవాహనంపై ఎదురెదురుగా వస్తూ ఢీకొట్టుకుని క్రిందపడి గాయాలపాలయ్యారు. అప్పుడే అటు వైపు వెళ్తున్న ఎమ్మెల్యే ఆర్కే ఇరువురిని ఆసుపత్రిలో చేర్పి ఇరువురి మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

పింఛన్ల పంపిణీ



ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అన్నపురెడ్డికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

మంగళగిరి: నగరంలో పెన్షన్ల పంపిణీ గురువారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ల పంపిణీ ప్రారంభించారు. ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో గుండెనొప్పితో చికిత్స పొందుతున్న అన్నపురెడ్డి సాంబశివరావుకు వలంటీర్ ఎస్ అలేఖ్య ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందించడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకటో తేదీనే పెన్షన్ నగదు చేతికందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి

ప్రజాసంఘాల నిరసన



మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తాడేపల్లిరూరల్: మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని, వారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను, హర్యానా మంత్రి సందీప్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం తాడేపల్లి బైపాస్ కుంచనపల్లి వద్ద రైతు సంఘం, ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతు సంఘం కార్యదర్శి మర్రావు సూర్యనారాయణ, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ శరణ్‌సింగ్‌ను, హర్యానా మంత్రి సందీప్‌సింగ్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు. నిరసన తెలిపే రెజ్లర్లకు రక్షణ కల్పించాలని, రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి లేదా హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు, రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కాజా వెంకటేశ్వరరావు, మోదుగుల శ్రీనివాసరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు, కొర్రప్రోలు ఈశ్వరరెడ్డి, ముసునూరు సుహాస్, మహిళా సంఘం నాయకురాళ్లు కె.ఉషారాణి, పి.గిరిజ, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, భీమవరపు దశరథరామిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నవ వధువును చంపే ప్రయత్నం చేసిన భర్త


– పోలీసులను ఆశ్రయించిన వధువు



తాడేపల్లిరూరల్: పట్టణంలోని సీతానగరం పుష్కర ఘాట్ వద్ద గురువారం రాత్రి కొత్తగా వివాహమైన ఓ యువకుడు తన భార్యను నీళ్లలో ముంచి చంపే ప్రయత్నం చేయగా మత్స్యకారులు గమనించడంతో ఆ యువతి ప్రాణాలతో బయటపడింది. ఆ యువకుడిని మత్స్యకారులు పట్టుకుని తాడేపల్లి పోలీసులకు అప్పగించారు. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరానికి చెందిన నాయుడు బాలాజీకి, మరదలు లక్ష్మీ దుర్గకు మూడు నెలల కిందట వివాహమైంది. విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చిన దంపతులు దర్శనం అనంతరం తాడేపల్లిలోని పుష్కర ఘాట్‌కు వచ్చారు. నీళ్లల్లో దిగుదామని భార్యతో చెప్పి బాలాజీ నీళ్లలో ముంచాడు. లక్ష్మీ కేకలు వేయడంతో చేపల వేటకు వచ్చిన వారు లక్ష్మీని రక్షించి పోలీసులకు అప్పజెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

బ్రేక్ ఇన్‌స్పెక్టర్ పేరుతో వసూళ్లు


- రోడ్డు ప్రమాదంతో వెలుగులోకి వచ్చిన సంఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు



గుంపెన శ్రీనివాసరావు

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారిపై బ్రేక్ ఇన్‌స్పెక్టర్ పేరుతో ఓ వ్యక్తి వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడిన సంఘటన గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెలుగు చూసింది. ఈ ఘటనపై ఇప్పటివరకు తాడేపల్లి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. సేకరించిన వివరాల ప్రకారం విజయవాడ కృష్ణలంకకు చెందిన గుంపెన శ్రీనివాసరావు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే లారీలకు దారి చూపించేందుకు గైడ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో తాడేపల్లి బైపాస్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో అధిక లోడుతో వెళుతున్న ఆటోలు ఆపి వారి నుంచి అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నాడు. విజయవాడ నుంచి ఓ వాహనంలో ఎక్కువ మందితో కనకదుర్గమ్మ గుడికి వెళుతున్న సమయంలో ఆటో ఆపి వారి నుంచి కొంత నగదు తీసుకున్నాడు. ఇదే సమయంలో విజయవాడవైపు నుంచి వస్తున్న ఓ ద్విచక్రవాహనం ఆగి ఉన్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు సమాచారం అందుకుని ఘటనా స్థలానికి వెళ్లడంతో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ విషయం బయటపడడంతో శ్రీనివాసరావుని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఘటన వివరాలపై సీఐను వివరణ కోరగా విచారిస్తున్నామని, వివరాలు వెల్లడిస్తామన్నారు.

టీ 20 క్రికెట్ లీగ్‌కు మంగళగిరి యువతి ఎంపిక



కడియం వాసవి అఖిల పావని

మంగళగిరి: టీ 20 క్రికెట్ లీగ్‌కు మంగళగిరి యువతి ఎంపికైంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఈనెల 4వ తేదీ నుంచి విజయనగరంలో నిర్వహించనున్న ఉమెన్ టీ 20 క్రికెట్ లీగ్ పోటీలలో మంగళగిరికి చెందిన కడియం వాసవి అఖిల పావని బెజవాడ బ్లేజర్స్ తరపున ఆడనుంది. విజయవాడ నలంద డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతున్న పావని ఎనిమిది సంవత్సరాలుగా క్రికెట్‌లో సాధన చేస్తుంది. క్రికెట్ కోచ్‌లు కృష్ణారావు, మస్తాన్‌రెడ్డిల పర్యవేక్షణలో శిక్షణ పొందుతూ మెళకువలు నేర్చుకున్న గతంలో టీ 20లో వైజాగ్ డాల్ఫిన్స్ తరపున ఆడి రాణించింది. మహిళా క్రికెటర్లలో పావని బౌలింగ్‌లో మూడో స్థానంలోను, లెఫ్ట్ ఆఫ్ స్పిన్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రాణిస్తుంది. పావని తండ్రి కడియం శ్రీనివాసరావు మలేరియా విభాగంలో పనిచేస్తుండగా, సోదరుడు రాహుల్ క్రికెట్‌లో ఆల్‌రౌండర్‌గా రాణిస్తుండడం మంగళగిరిలోని క్రికెట్ అభిమానులు అభినందిస్తున్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ శాంతి కల్యాణం

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని సువర్చలాసమేత ప్రసన్నాంజనేయస్వామి 19వ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన నిర్వహించి శాంతికల్యాణం వేదపండితులు పరాంకుశం అజయ్‌బాబు నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను పి.వీరేశంగుప్త, కె.పేరారెడ్డి పర్యవేక్షించారు.

అసైన్డ్ భూముల్లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం గ్రామంలోని అసైన్డ్ భూముల్లో ఇల్లు నిర్మించుకుని జీవిస్తున్న వారికి ప్రభుత్వం రెగ్యులర్ చేసి పట్టాలు ఇవ్వాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. గురువారం తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డిని కలిసి వడ్డేశ్వరం గ్రామంలోని సర్వే నెంబర్ 80 అసైన్డ్ భూమిలో ఇల్లు నిర్మించుకున్న పేదల ఇళ్లను రెగ్యులర్ చేయాలని, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. త్వరలో వడ్డేశ్వరంలోని పేదల ఇళ్ల స్థలాలను పరిశీలించి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారని వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కారసాల స్వాతి, ఎస్‌కే ఖాసింబి, చిన్ని, భ్రమరాంబ, శ్యామ్, ఎస్‌కే బాజీ, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

తాడికొండ: తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ బిక్కి మహేష్‌బాబు తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించతలపెట్టిన సర్వసభ్య సమావేశానికి మొత్తం 19 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, నిడుముక్కల ఎంపీటీసీ బోడపాటి సుశీల, కంతేరు ఎంపీటీసీ వలపర్ల కల్పనలు మాత్రమే హాజరయ్యారు. కోరం లేనందున సభ వాయిదా వేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో తెలిపారు.

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

తెనాలిఅర్బన్: బాలనాగు ఉమానాగ హర్షవర్ధన్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీ సాయి ప్రసాదం సేవా సమితి ఆధ్వర్యంలో చినరావూరులోని పేదలకు గురువారం ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. సమితి నిర్వాహకులు లక్కరాజు సాయి, ఎస్‌బీఐ అధికారి రవీంద్ర, సమితి సభ్యులు అఖిల్, రొంపిచర్ల సురేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పెదకోనేరు పునర్నిర్మాణం చారిత్రాత్మకం

- కమ్యూనికేషన్స్ విభాగం ప్రభుత్వ సలహాదారు జీవీడీ కృష్ణమోహన్
- కోనేరు విశిష్టతను వివరించిన ఎమ్మెల్యే ఆర్కే



పెదకోనేరు పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారు జీవీడీ కృష్ణమోహన్, ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: ఎంతో పురాతనమైన, విశిష్టత కలిగిన మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ పెద కోనేరు (కల్యాణ పుష్కరణి) పునర్నిర్మాణం చేపట్టడం చారిత్రాత్మకమని కమ్యూనికేషన్స్ ప్రభుత్వ సలహాదారు జీవీడీ కృష్ణమోహన్ పేర్కొన్నారు. నగరంలోని పెదకోనేరును గురువారం కృష్ణమోహన్ పరిశీలించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పెదకోనేరు చరిత్రను వివరించడంతో ప్రస్తుతం జరుగుతున్న పనులను వివరించారు. 500 ఏళ్ల చరిత్ర కలిగిన పెదకోనేటిలోని నీరు నృసింహ స్వామి వారికి పూజలు, అభిషేకాలు, నిత్యపూజలు నిర్వహించడంతోపాటు చుట్టుపక్కల ప్రజలకు నీటి అవసరాలు తీర్చేదన్నారు. కాలక్రమేణ కోనేరులోని నీటిని వాడకపోవడంతో పాడుపడిపోయిందన్నారు. రూ.1.50 కోట్లతో పెదకోనేరుకు పూర్వ వైభవం తీసుకువచ్చి మరలా స్వామి వారికి సేవలు అందించేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఆర్కే వివరించారు. అంతేకాక కోనేరు నిర్మాణానికి కారణమైన పూర్వీకుల విగ్రహాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ పెదకోనేరు ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే ఆర్కే తీసుకున్న చొరవ, కృషి అభినందనీయమని కొనియాడారు. చారిత్రక సంపదలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి పాల్గొన్నారు.

మలేరియా మాసోత్సవాలు ప్రారంభం



మలేరియా మాసోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీ

మంగళగిరి: మలేరియా నివారణపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించాలని డాక్టర్ అనూష అన్నారు. మలేరియా మాసోత్సవాలు ప్రారంభం సందర్భంగా గురువారం నగరంలో గణపతినగర్ అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. మాసోత్సవాలను ప్రారంభించిన డాక్టర్ అనూష మాట్లాడుతూ వర్షాకాలం రానున్న నేపథ్యంలో బ్యాక్టీరియా, క్రిములు వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంపై ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ అధికారి ఏ శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, జయలక్ష్మిలు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

- తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన
- బోర్లు మరమ్మతులు
- గడప గడపకు మన ప్రభుత్వంకు అనూహ్య స్పందన



బీసీ కాలనీలో పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కత్తెర సురేష్‌కుమార్, నాయకులు

తాడికొండ: బీసీ కాలనీలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పైపులైన్ పనులకు శంకుస్థాపన చేసిన ఆయన బోరు పంపుల మరమ్మతుల పనులను పరిశీలించి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించి సమస్యలు తెలుసుకున్న ఆయన బీసీ కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు తీసుకెళుతున్న జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందనడంలో సందేహం లేదన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి పాలనలో జరగని అభివృద్ధి ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే జరిగిందనడంలో దేశ వ్యాప్తంగా విడుదలైన ప్రగతి నివేదికలే నిదర్శనమన్నారు. నేడు రాష్ట్రంలో కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా పేదవాడికి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతుంటే ఓర్చుకోలేని చంద్రబాబు తప్పుడు ప్రచారాలకు దిగడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోకల సరోజినీ, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు పలువురు ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సేవలు అభినందనీయం



ఎంపీడీవో బిక్కి మహేష్‌బాబును సత్కరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్, ఎంపీపీ, సర్పంచ్

తాడికొండ: అంకితభావంతో పనిచేసిన వారికి గుర్తింపు తప్పక లభిస్తుందని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తూ పల్నాడు జిల్లాకు ఎంపీడీవోగా బదిలీపై వెళుతున్న బిక్కి మహేష్‌బాబును ఆయన సత్కరించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి ప్రజలకు తగిన సేవలందించాలన్నారు. తాడికొండలో ఎంపీడీవో కార్యాలయం ఏవోగా, ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బిక్కి మహేష్‌బాబు అందించిన సేవలు అభినందనీయమన్నారు. మహేష్‌బాబును శాలువా, పుష్పగుచ్ఛంతో కత్తెర సురేష్‌కుమార్, నాయకులు, కార్యాలయ ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, తాడికొండ, నిడుముక్కల సర్పంచ్‌లు తోకల సరోజినీ, మాదాసు రత్నకుమారి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.